# రూమ్ నెంబర్ థర్టీ ఎయిట్

శ్రీరామచంద్ర

రూమ్ నెంబర్ ముప్పై ఎనిమిది ఆ కాలేజీలోనే విశిష్టతను సంతరించుకొన్నది. ప్రతి సంవత్సరం బి.కాం. ఫైనలియర్ క్లాసులే జరిగే రూమ్ ముప్పై ఎనిమిదది. ఆ కాలేజీలో అన్నిటికన్నా పొడవాటి వరండా చివర్న వుండే రూమ్ ముప్పై ఎనిమిది. ఇది కార్నర్ క్లాసు. అ క్లాసులో ఓ పీరియడ్‌కూడా వుండని విద్యార్థి 'స్టూడెంట్' అనడానికి తగడు.




ప్రతి లెక్చరరూ తన లెక్చర్‌లో వుపయోగించే 'సంత', 'చేపల మార్కెట్' అన్న పదాలు ఆ క్లాసుకి లెక్చరర్లు పెట్టిన ముద్దు పేర్లు, 'గౌరవప్రదమైన' పేర్లు. క్లాసులోకి అడుగు పెట్టిన ప్రతి లెక్చరరూ 'అవర్ బెల్' మోగేంత వరకూ గుండెల్ని అరచేతిలో పెట్టుకొని పాఠాలు చెప్పటం ఆ క్లాసు 'నిత్యకార్యక్రమం'. మొదట అడుగుపెట్టేటప్పుడు ఎంతో బింకంగా, సీరియస్‌గా వుండే లెక్చరర్లు, బెల్ మోగిన తరువాత తలవంచుకొని, చెమటలు గక్కుతూ పరుగులాంటి నడకతో క్లాసునుంచి వెళ్ళటం ప్రతిరోజూ చూడొచ్చు. అందుకే ఆ రూముకో ప్రత్యేకతా, విశిష్టతాను.

అంతెందుకు ?

ఆరు నెల్లముందు ఓ ప్రిన్సిపాల్ ఆ కాలేజీకి కొత్తగా ట్రాన్స్‌ఫరయి వచ్చేడు. జాయిన్ అయిన మూడోరోజు ఆయన తన

రూముకు వెళ్తూ వరండాలోకి వినబడుతున్న అల్లరి గమనించి తలతిప్పి చూశాడు. "ముప్పై ఎనిమిది" అన్న నెంబర్ కనబడింది. డయాస్‌పై లెక్చరర్ ఎవరూ లేరు. ప్రిన్సిపాల్ పైట సర్దుకొని క్లాసులోకి అడుగుపెట్టాడు. అంతే క్లాసు మొత్తం ఒక్కసారిగా లేచి నిలబడి, "గుడ్ మార్నింగ్ సార్ !" అంటూ కోరస్‌గా విష్ చేసింది. ఆయనకూడా మొహమాటంగా, 'గుడ్ మార్నింగ్ !, ప్లీజ్ సిడౌన్ !" అంటూ వారి వినయవిధేతలకు ఆశ్చర్యంతో — ఆనందంతో వుక్కిరి బిక్కిరై డయాస్ ఎక్కి నిల్చొన్నాడు. ఆ తర్వాత జరిగిన సంఘటనలు ఆయన ఏ కాలేజీలోనూ ఫేస్ చేయలేదు— ఇకముందు 'ఫేస్' చేస్తాడో లేదోకూడా తెలీదు.

ఓ పేపర్ రాకెట్ ప్రిన్సిపాల్ తలను ముద్దుపెట్టుకొంటూ దూసుకెళ్ళి గోడకు గుద్దుకొని రిఫ్లెక్టయి కిందపడింది. వెనుక బెంచీలనుంచి పిల్లికూతలు, కుక్క అరుపులు వినిపించేయి. బెంచీలపై 'మృదంగ నాదం' వినిపించింది. బాయ్సేదే ఈ అల్లరి అనుకొంటూ ఆయన అమ్మాయిలవైపు తిరిగి చూసాడో లేదో, అమ్మాయిలందరూ కిసుక్కుమని ఒక్కమారుగా నవ్వి తల వంచుకొన్నారు. ఓ అమ్మాయి నోట్లో చిటికెనవేలు పెట్టుకొని అందంగా బోలెడు సిగ్గుపడిపోయింది. ప్రిన్సిపాల్ గార్కి క్లాసు మొత్తం ఓ మారు కళ్ళముందు గిర్రున తిరిగి నట్లనిపించింది.

"ఆహా! నవమన్మథుడు రా! అమ్మాయిలు ఈయన్ని చూస్తూనే సిగ్గుతో తలవంచేసారు(?)" ఓ కొంటెకుర్రాడు కామెంట్ విసిరాడు — అతడు భాషా.

"హా! ఏమిటీ వైపరీత్యము! మా క్లాసు అమ్మాయిలు ఈ మన్మథుని వశంబైనారే! అయ్యారే! మా గతి ఏమిటి?" మరో స్టూడెంట్ రాని కన్నీళ్ళు తుడుచుకొంటూ భాషాభుజాల్ని పట్టుకొన్నాడు. అతడు కృష్ణశాస్త్రి. ముద్దుగా తన పేరును కె.శాస్త్రిగా మార్చుకొని 'కొంటె శాస్త్రి'గా పేరుపడ్డవాడు.

"అయినా, మనల్ని చూస్తేనే, చురచురా ముఖాన్ని అష్టవంకరలు తిప్పే అమ్మాయిలు ప్రిన్సిపాల్‌ని చూసి సిగ్గుపడి తలవంచేయడంలో అర్థమేమిట్రా అబ్బీ!" కనుచివర్లలో అమ్మాయిలను చూస్తూ వాపోయాడు రెడ్డి— సుబ్బారెడ్డి.

ప్రిన్సిపాల్‌కు కాళ్లు చేతులు పనిచేయటం మానేసాయి. ఓమారు క్లాసు మొత్తం కలయజూసి, "మీ లెక్చరర్‌ను ఇప్పుడే పంపిస్తాను, అంతవరకూ నిశ్శబ్దంగా వుండండి" అంటూ ఏదో చాలా ముఖ్యమైన పని గుర్తుకొచ్చినట్లు పరుగులాంటి నడకతో బయటికి దూసుకెళ్లిపోయారు.

"ఒరేయ్! పాపం లేడిలా పరుగెడుతున్నాడేరా ఈ మహానుభావుడు!" గట్టిగా అరిచాడు రెడ్డి.

"లేడి! ఆహాలేడి! ఓహో లేడి! ఏమిటీ లేడి పరుగు!" అని క్లాసు మొత్తం కేకపెడుతూండటం వరండాకార్నర్ తిరుగుతూన్నంత వరకూ వినబడింది కొత్త ప్రిన్సిపాల్‌కు.

ఆ తరువాత వరండా సర్వేరాయుళ్ళ చెమటలతో తడిసిన ముఖాన్ని కర్చీఫ్‌తో తుడుచుకొంటూ గబగబా 'ప్రిన్సిపల్ గదిలోకి' ఆయన అడుగు పెట్టడం చూసేరు. అప్పుడే ఓ కుర్రాడరిచాడు. "గురుడు ముప్పై ఎనిమిది వెళ్లినట్టున్నాడ్రోయ్!" అని.

కోయిన్సిడెన్స్ అంటాం చూడండీ! అది ఆయన పట్ల 'దయ' చూపించింది. ఆయన పేరేమో 'ఎల్. పొన్నయ్య! ముప్పై ఎనిమిది కెళ్ళాడు' 'లేడి' పొన్నయ్యగా మారిపోయాడు. ఇది జరిగిన తరువాత ప్రిన్సిపాల్ "ముప్పై ఎనిమిది కెళ్లడం" అన్న మాటను తన డిక్షనరీలోంచి తీసేసాడు. అలాంటి క్లాసు ముప్పై ఎనిమిది!

అదిగో...

ఆ కాలేజీకి ట్రాన్సఫరయి వచ్చాడు నారాయణ్. అకౌంటెన్సీ తీసుకుంటాడతను. ప్రిన్సిపల్‌గార్ని కలసి జాయినింగ్ రిపోర్టిచ్చాడు. ప్రిన్సిపాల్ గారి మేధాసంపద గొప్పది. ట్రాన్సఫరయి వచ్చినా, కొత్తగా అప్పాయిట్ అయినా లెక్చరర్లకు ఓ టెస్ట్ జరిపేవాడు.

"బి.కాం. ఫైనలియర్ క్లాసుకు మొట్టమొదటిసారిగా వెళ్ళిన లెక్చరరు నలభై ఐదు నిమిషాలు క్లాసులో వుండి పాఠంచెప్పి అవర్‌బెల్ మోగినతరువాత వచ్చాడంటే ఎఫిషియంట్ లెక్చరర్. అతను మొదటి 'గ్రేడ్'కు చెందివాడు. అతనిని ఆ క్లాసుకే పంపాలి. ముప్పై నిమిషాలకే పరుగెత్తుకొచ్చేవాడు 'ఫరవాలేదు' అతను రెండో 'గ్రేడ్'కు చెందినవాడు. అతన్ని సమయానుకూలంగా ఏ క్లాసుకైనా పంపొచ్చు. పావుగంటయినా కాకమునుపే పరుగెత్తుకొచ్చిన వాడు 'బ్యాడ్' మూడో 'గ్రేడ్'కు చెందివాడు. అతనికి ఫస్ట్‌ఇయర్ క్లాసులే ఇవ్వాలి" ఇవి ప్రిన్సిపాల్ ముప్పై ఎనిమిదికెళ్లివచ్చిన తరువాత తీసుకొన్న నిర్ణయాలు, గ్రేడులున్నూ. ఆయన వచ్చి ఆరునెల్లయినా, ఇంతవరకూ ఐదుగురు లెక్చరర్లు ట్రాన్సఫరయి వచ్చినా ఒక్కరూ రెండో గ్రేడ్ కూడా పొందలేదు. ఇక గత్యంతరం లేక వారినే ఆ క్లాసుకి తరిమారు. వారు ఏడుపొక్కటే తక్కువగా వెళ్లేరు.

నారాయణ లెక్చరర్లకు పరిచయం చేయబడ్డాడు. మిగతా లెక్చరర్లు నారాయణకు ముప్పై ఎనిమిది గురించి, ప్రిన్సిపాల్ 'గ్రేడ్' గురించి, ఇంతవరకూ రెండో గ్రేడ్ కూడా ఎవ్వరూ పొందకపోవటం గురించి, ముప్పై ఎనిమిది — భాషా, శాస్త్రి, రెడ్డిలను గురించి చెప్పేరు.

"చూడండి నారాయణగారు! మిమ్మల్ని రేపు ప్రిన్సిపాల్ పిలుస్తారు. బి. కాం. క్లాసు మర్నాడు తీసుకొమ్మని చెబుతాడు. మీరు మాత్రం ఒప్పుకోవద్దు. 'మొదటి రోజే ఫైనలియర్ లేమిట్సార్!' అంటూ ఏదో ఓ కారణం చెప్పి మాన్పించుకోండి!" కో లెక్చరర్ సలహా ఇచ్చాడు.

నారాయణ అప్పటికి తలవూపి మౌనంగా వుండిపోయేడు.

* * *

"గుడ్ మార్నింగ్ సార్! పిలిచారట!" అడిగాడు నారాయణ ప్రిన్సిపాల్ రూమ్‌లోకి అడుగుపెడ్తూ.

"గుడ్ మార్నింగ్! కూర్చోండి!" అన్నారు ప్రిన్సిపాల్ చదువుతూన్న ఫైలులోంచి తలెత్తి చూసి. "మీరు బి. కాం. ఫైనలియర్‌కు అకౌంటెన్సీ తీసుకోవాలి. కొత్తగా వచ్చారు కాబట్టి ఆ క్లాసు గురించి మీకు తెలుసుండకపోవచ్చు ...".

"కో లెక్చరర్స్ చెప్పారు సార్!" నవ్వుతూ చెప్పాడు నారాయణ. "నాకూ ఈ ఛాలెంజ్‌ని ఫేస్ చెయ్యాలని వుంది. వాళ్ళకెప్పుడు పీరియడ్ వుంటుంది?"

"రేపు రెండో పీరియడ్. మీకు ముందున్న లెక్చరరు మూడు చాప్టర్లే జరిపేరు" చెప్పారాయన. ఆయన కంఠంలో ఆశ్చర్యం తొంగి చూసింది.

"థాంక్యూ సార్! రేపు ఆ పీరియడ్ తీసుకొంటాను." లేచి నిలబడి చెప్పాడు నారాయణ. "వస్తాను సార్!"

ప్రిన్సిపల్ తలవూపేరు. నారాయణ వెళ్ళిపోయాడు. ప్రిన్సిపాల్ వెనుక నుంచి నారాయణను చూస్తూండిపోయారు. స్ప్రింగ్ డోర్స్ మూసుకొన్నాయి.

* * *

# మనమంతా!

ఎక్కడో ఎప్పుడో మనమంతా
అప్పు డప్పుడు వోడిపోతూనే వున్నాం.
లంచం ఇచ్చే సగం చేతులతో
లంచం పట్టే పుచ్చిన చేతులతో!
ఆత్మవంచనే ఆనందంగా
కల కాలం ఇలానే సాగుతుందనే చోట
మనమంతా
తాత్కాలికంగానైనా వోడిపోతున్నాం!

—నిఖిల్

"రేపు మన క్లాసుకి కొత్త లెక్చరర్ వస్తున్నాడంట !"

"ఆయన గురించి మనకేమీ తెలీదే ఎలా కనుక్కోవడం ?"

"ఐడియా !" చెప్పాడు శాస్త్రి – కె. శాస్త్రి.

"ఏమిటి ?" అడిగాడు భాషా.

"ఈరోజు ఇంటర్వెల్‌లో డిపార్ట్‌మెంట్ వైపు వెళ్దాం. సాధారణంగా ఎక్కువ మంది లెక్చరర్లుండరు. ఆ కొత్త లెక్చర్‌ని చూసొద్దాం."

"రైట్ !" చెప్పాడు రెడ్డి.

"ముగ్గురం వెళ్ళటం ఎందుకు? ఎవరైనా ఒక్కరే వెళ్తే బాగుంటుంది." భాషా చెప్పాడు. 'బాగుంటుంది' అన్న పదాన్ని నొక్కి పలుకుతూ.

"శాస్త్రి వెళతాడు !" చెప్పేడు రెడ్డి.

"అలాగే !"

*   *   *

"భలే తమాషా జరిగింది బాస్ ! నేనేమో ఆయన దగ్గరకెళ్ళానా. ఎవరో కొత్త లెక్చరర్ అనుకొన్నాడు గాబోలు నన్ను చూస్తూనే విష్ చేసేడు. నేనూ విష్ చేసి లెక్చరర్ హోదాలోనే జవాబిచ్చాను. నా పేరడిగాడు. చెప్పాను. అలా మాట్లాడుతూ, మాట్లాడుతూంటే చెప్పేడు. పేరు 'నారాయణ' తిరుపతినుంచి ట్రాన్స్‌ఫర్ అయి వచ్చేడట !" చాక్లెట్ నములుతూ చెప్పేడు శాస్త్రి.

"గుడ్ ! మనం ముగ్గురం రేపు తొమ్మిది కంతా కాలేజీలో వుండాలి. బై నైన్ వుయ్ షుడ్ బి హియర్. రైట్ ?" చెప్పాడు రెడ్డి భాషా, శాస్త్రిలను చూస్తూ. యిద్దరూ తలూపేరు.

*   *   *

# రూమ్ నెంబర్ థర్టీఎయిట్

రెండవ పీరియడ్ బెల్ మోగింది. అమ్మాయిలు, అబ్బాయిలు. క్లాసు రూమ్స్ మారుతున్నారు. వరండా మొత్తం 'సర్వే రాయుళ్ళకు' 'కనుల పండుగగా' వుంది. అమ్మాయిల్ని చూస్తూ కామెంట్ విసురుతున్నారు కొందరు. మరి కొందరు కార్నర్‌లో నిలబడి వచ్చిపోయే అమ్మాయిల్ని "హల్లో !" అంటూ పలకరించి, వారి చురుక్కుమని చూసే చూపులను చూసి సంతోషపడిపోతున్నారు. కొందరు చాలా సిన్సియర్ విద్యార్థుల్లా దారి వదలి, అమ్మాయిలు వెళ్తూంటే సడన్‌గా అడ్డంగా నిలబడేరు.

రూమ్ నెంబర్ ముప్ఫైఎనిమిది బయట ఒక్కరుకూడా లేరు !

ఆ రోజు అదో పెద్ద సస్పెన్సయిపోయింది స్టూడెంట్సుకు. ప్రతి ఒక్కరూ క్లాసులోకి తొంగి చూసి వెళ్ళిపోతున్నారు. తెలిసిన స్టూడెంట్ వుంటే పిలిచి విషయమేమిటని అడుగుతున్నారు. కొత్త లెక్చరర్ వస్తున్నాడని వాళ్ళూ నవ్వుతూ చెబుతున్నారు. కాలేజీ వాతావరణం ముప్ఫైఎనిమిది ముందు ఓ సరికొత్త రూపుదిద్దుకొంది.

శాస్త్రి బయటకు వచ్చి చూసాడు. దూరంగా నారాయణ వస్తున్నాడు.

"లెక్చరర్ వస్తున్నాడ్రోయ్ !" క్లాసులోకి వెళుతూ గట్టిగా అరిచి చెప్పాడు శాస్త్రి. అమ్మాయిల గుసగుసలు, అబ్బాయిల అల్లర్లు సర్దుకొన్నాయి.

శాస్త్రి, రెడ్డి భాషాలు కడపటి డెస్కుపై కూర్చొన్నారు. శాస్త్రి రాకెట్‌లు తయారు చేస్తున్నాడు. రెడ్డి భాషావైపు చూశాడు.

"నేను రెడీ !" అన్నట్లుగా చిన్నగా నవ్వాడు భాషా. సూది పడినా వినిపించేంత నిశ్శబ్దం క్లాసులో నెలకొన్నది. నారాయణ వస్తున్నాడు. బూట్ల శబ్దం 'టక్, టక్'మని వినిపిస్తూంది.

నారాయణకు అనుమానం కలిగి మెల్లగా క్లాసులోకి తొంగి చూసేడు.

"స్టూడెంట్స్ వున్నారు !"

"కో లెక్చరర్స్ చెప్పినట్లు వీళ్ళేం అల్లరి చేసేవాళ్ళుగా కనిపించటంలేదే !" తనలో తాను ఆలోచించుకొంటూ క్లాసులోకి అడుగుపెట్టాడు నారాయణ.

"గుడ్ మార్నింగ్ 'సార్ !" అందరూ కోరస్‌గా విష్ చేసేరు.

"గుడ్‌మార్నింగ్ ప్లీజ్ సిడౌన్ !" విష్ చేసి చెప్పాడు. "నా పేరు నారాయణ. ఈ కాలేజీకి కొత్తగా ట్రాన్స్‌ఫరయి వచ్చాను. మీకు అకౌంటెన్సీ తీసుకొంటాను..."

"నైద్యో నారాయణో హరీ !" రెడ్డి వెనుక బెంచీనుంచి అరిచేడు.

"హూ **ఈజ్** దట్ !" నారాయణ ఆ వైపుగా చూశేడు.

రివ్వున ఒకటి వెంబడి మరొక రాకెట్ అతనిమీదుగా దూసుకెళ్ళింది. నారాయణకు తాను అంతవరకూ అనుకొన్న మాటలు వట్టివని తెలిసిపోయాయి.


"...మీరు రాకెట్‌లు విసిరినంత మాత్రాన నాకేమీ ఒరిగేదిలేదు" అన్నాడు నారాయణ బోర్డువైపు తిరుగుతూ.

"ఎదురుగా చూడు !" బోర్డుపైన రాతల్ని చదివి అప్రయత్నంగా వెనుకవైపు తిరిగాడు. దూరంగా గోడపై "పక్కవైపు చూడు !" అని పెద్ద అక్షరాలతో రాసివుంది. నారాయణ ఆశ్చర్యంతో తిరిగి చూసాడు. "నీ వెనుక చూడు !" అని వుందక్కడ. నారాయణకు అర్థమైపోయింది. తన్ను వెర్రివెధవాయి చేయటానికి అలా రాసిపెట్టేరు. నారాయణ తిరుగబోతూంటే రెడ్డి లేచి నిలబడి అడిగాడు, "ఏం సార్ ! దిక్కులు చూస్తున్నారు !" అతని కంఠంలో వ్యంగ్యం తొణకిసలాడింది.

"పాపం ! మేష్టారుగారికి మొదటి క్లాసు కదా ! అన్ని దిక్కులవైపు చూసి దణ్ణం పెట్టుకొంటున్నాడు !" శాస్త్రి కామెంట్ విసిరేడు.

గొల్లుమని నవ్వేరు స్టూడెంట్స్ అందరూ.

"సైలెన్స్ ! సైలెన్స్ !" గట్టిగా అరిచానుకొన్నాడు నారాయణ. కాని మాటలు గొంతు దాటి రాలేదు. నిస్సహాయంగా చూస్తూండిపోయేడు. కొద్ది క్షణాలు మాత్రమే. వెంటనే తేరుకొని, "మీరిలా అల్లరి చేస్తూంటే పాఠం తీస్కోవటం జరుగదు. ఇప్పుడే నేను వెళ్ళిపోవాల్సి వస్తుంది !" గట్టిగా చెప్పాడు.



''ప్చ్! పాపం రా!' నారాయణ చాలా బాధపడిపోతున్నాడు!''

వెనుక బెంచీనుంచి ఏడుస్తున్నట్లు ఎక్కిళ్ళు వినిపించేయి. నారాయణకు ఈ అనుభవాలు కొత్త.

నారాయణ అటెండర్ సర్క్యులర్ తేవటంతో దానిని తీసుకొని చదవబోయాడు.

''నారాయణా! ఆ సర్క్యులర్ ఏమిటి?'' సుబ్బారెడ్డి లేచి నిలబడి అడిగాడు.

నారాయణకు కోపం తన్నుకొచ్చింది. ఒక్క క్షణంలో మామూలుగా మారిపోయాడు. నిదానంగా, స్పష్టంగా అడిగేడు సుబ్బారెడ్డిని చూస్తూ! – ''ఓ లెక్చరర్ అనే గౌరవంకూడా మీకు లేదా?''

''మేము మిమ్మల్నేమీ అడగలేద్సార్! ఆ అటెండర్‌ని అడిగాం, శాస్త్రి నిలబడి చెప్పాడు. ''కావాలంటే అటెండర్‌ని అడగండి! అతని పేరూ నారాయణే!''

నారాయణ అటెండర్ వైపు చూసేడు. 'అవున'న్నట్టు తలూపాడు. నారాయణ మౌనంగా ఒక్క క్షణం వుండిపోయాడు. సర్క్యులర్ చదివి వినిపించాడు.

''తన ఐదేళ్ళ సర్వీసు ఎందుకూ కొరగాదా? కాదు. తన ప్రతిభను ఇక్కడే చూపాలి. వీళ్ళను తన దారిలోకి రప్పించుకోవాలి. తాను వాళ్ళ మార్గంలోనే వెళ్ళి, మెల్లగా వాళ్ళను తన వైపు తిప్పుకోవాలి:

'తేనె కావాలనుకొన్నవాడు తేనెపట్టును చెడగొట్టడు!''

నారాయణ పెన్నును జేబులో పెట్టుకుంటూ దృఢనిశ్చయానికొచ్చాడు.

''డియర్ ఫ్రెండ్స్!'' అన్నాడు నారాయణ క్లాసు మొత్తం కలయజూస్తూ.

ఒక్కసారిగా నిశ్శబ్దం నెలకొన్నది. ఇంత వరకూ ఏ లెక్చరరూ వాళ్ళని అలా సంబోధించలేదు. ''స్టూడెంట్స్!'' అని అంటూండేవాళ్ళే. వారికి పిలుపు కొత్త. అందుకేగామోలు అమ్మాయిలుకూడా ఆశ్చర్యచకితులై నిశ్శబ్దంగా వుండిపోయేరు.

''... మీకందరికీ నా పేరు ముందే చెప్పాను. క్లాసులో అడుగు పెట్టేంతవరకూ, అకాంటెన్సీ జరపాలన్న నిర్ణయంతోనే వచ్చాను. కాని నేను మీకు కొత్త. నాకు మీరు కొత్త. మీతో పరిచయం చేసుకోకుండా పాఠం జరుపుదామనుకొన్న నా నిర్ణయం తప్పే...'' మొదట తన తప్పును చెప్పకుండా చెప్పడం... ఇదే నారాయణ పాటించింది.

''...మీలాగే నేనూ ఒకప్పుడు విద్యార్థినే. ఇంతకన్న ఎక్కువ అల్లరి మా క్లాసులోనూ వుండేదే! మా లెక్చరర్లుకూడా మా మీద కోప్పడేవాళ్ళే. అయినా వారు కోపంలోకూడా జోకులు విసిరేవారు ...

... ఈ రోజు నేను పాఠం చెప్పబోవటం లేదు. మాకు వచ్చిన లెక్చరర్లగూర్చి చెబుతాను. అకౌంటెన్సీకి ఓ లెక్చరరు వచ్చేవారు. ఆయన చాలా తమాషాగా మాట్లాడేవాడు. ఆయన తీసుకొన్న మొదటిక్లాసులో మన రాష్ట్రంలోని వివిధ రకాలు మాట్లాడేవారినిగూర్చి చెప్పేరు. ఆయన షర్ట్‌ను ఏమనేవారో తెలుసా?...''

''సొగ్గుడ్డ!'' నారాయణ కొద్ది క్షణాల తర్వాత చెప్పాడు.

ఒక్క పెట్టున నవ్వారు విద్యార్థులందరూ.

''ఓ మారు మేం వరండాలో తిరుగుతూంటే దగ్గరకు రమ్మని పిలిచేరు. మేం వెళ్ళగానే ''వై ఆర్ యు రొటేటింగ్ ఇన్ ది వరండా?'' అంటూ కోపంగా అడిగేరు. ''రొటేటింగ్ ఏమిట్సార్'' అంటే, తెలుగులో మనం ఏమంటాం? వరండాలో ఎందుకు తిరుగుతున్నావ్? అనే కదా! తిరుగుటకు ఆంగ్లంలో రొటేటింగ్ కాదా' అనేవారు. ఫీజు కట్టేశారా? అనడానికి వారేమడిగేవారో తెలుసా?...''

''హేవ్‌యి 'బ్రైడ్' ది ఫీజ్! కరెక్టేనా సార్!'' శాస్త్రి లేచి నిలబడి అడిగాడు. అతని ముఖంలో నారాయణ పట్లున్న చులకనభావం ఈమారు కనబళ్ళేదు.

''కరెక్ట్! ఆయనకు ఇంగ్లీష్ రాదనుకోబోయేరు. ఆయన మాట్లాడుతూంటే గంటల తరబడి అలాగే వింటూ వుండిపోవాలనిపిస్తుంది!''

''త్రిమూర్తుల్ని పరిచయం చెసుకోవాలనుంది!'' అన్నాడు నారాయణ, 'త్రిమూర్తుల్ని' అనే పదాన్ని వత్తిపలుకుతూ.

''త్రిమూర్తులా వారెవరుసార్!''

నారాయణ నవ్వుతూ వెనుక బెంచీ వైపు చూపుడు వేలు చూపించాడు. శాస్త్రి, రెడ్డి, భాషా లేచి నిలబడి తమ పేర్లు చెప్పేరు. బెల్ మోగింది. నారాయణ ''థాంక్యూ ఫ్రెండ్స్!'' అంటూ బయటకు నడిచాడు.

* * *

''వి ఆర్ వెరీ సారీ సార్! క్లాసులో అలా బిహేవ్ చేసినందుకు సిగ్గుపడుతున్నాం'', శాస్త్రి చెప్పాడు.

''ఇట్సాల్ రైట్! క్లాసులోనే చెప్పానుకదా అది నా తప్పేనని. ఆ మాత్రం అల్లరిక్లాసులో వుండాలయ్యా! అన్నిరకాలుగా సంతోషంగా వుండగలిగే రోజులు కాలేజీ రోజులే కదా! ఒక్కవిషయం చదువుగూర్చి మరిచిపోకూడదు. అది చాలా ముఖ్యం!''


* * *

నారాయణ కామర్స్ డిపార్ట్‌మెంట్ బయట నిల్చొన్నాడు. అమ్మాయిలు వాదుకొంటూ, నవ్వుకుంటూ వెళుతున్నారు. నారాయణను చూసి విష్ చేసి వెళ్ళేరు శాస్త్రి, రెడ్డి, భాషా. వాళ్ళకు కొద్దిగా ముందుగా అటెండర్ వెళుతున్నాడు. అతను కామర్స్ డిపార్ట్‌మెంట్ అటెండర్. నారాయణకు అప్పుడు కలిగిందో ఆలోచన...

''సుబ్బా! ఇలారా ఓమారు!'' గట్టిగా కేకేసి పిలిచాడు నారాయణ.

సుబ్బారెడ్డి టక్కున నిలిచాడు. ముందు వెళుతున్న అమ్మాయిలు తిరిగి చూసారు. శాస్త్రి రెడ్డి ముఖంలోకి ప్రశ్నార్థకంగా చూసేరు, ''నిన్నేనా?'' అన్నట్లు. ''కాదేమో!'' రెడ్డి తలూపుతూ అడుగు ముందుకు వేసాడు.

''సుబ్బా! నిన్నే, ఓమారిలా రా!'' నారాయణ మరోమారు పిలిచాడు. రెడ్డి గిరుక్కున తిరిగాడు. శాస్త్రి, భాషా అతని వెనుకగా వెళ్ళేరు. నారాయణ వరండా కొసను



చూ స్తు న్నా డు. అమ్మాయిలు ఏం జరుగుతుందో అన్నట్లు నిలబడిపోయేరు !

''నన్నేనా మీరు పిలిచింది!'' రెడ్డి కరకుగా చూస్తూ అడిగేడు.

నారాయణ అప్పుడే వాళ్ళను చూసిన వాడిలా, ''హల్లో ఏమిటి మీరంటున్నది ?'' అడిగ్గేడు.

''నన్నేనా మీరు ''సుబ్బా'' అని పిలిచింది!'' ఈసారి రెడ్డి కంఠంలో కోపం మరోమెట్టు ఎక్కింది.

''నిన్నా ! కాదే ! అదిగో ఆ అటెండర్ సుబ్బయ్యను పిలిచాను !'' చేయి చూపిస్తూ, ఆశ్చర్యాన్ని నటిస్తూ చెప్పాడు.

రెడ్డి ముఖంలో కత్తివాటుకు నెత్తురు చుక్కలేదు. ముందు రోజు జరిగిన సంఘటన గుర్తుకొచ్చింది అతనికి— తాము ''నారాయణా'' అని లెక్చరర్‌ని పిలిచి అటెండర్‌ని పిలిచామని చెప్పడం—నారాయణ ముఖం అదోలా మారడం..

అతని ముఖంలో కొద్దికొద్దిగా ప్రసన్నత చేకూర్తుంది. ''టిట్ ఫర్ టాట్.'' అడిగాడతను. మిత్రుల మధ్య జరిగే పోట్లాటలలో ఎంత వేడుక వుంటుందో, ఇంకొకడు తన్ను 'చీట్' చేస్తే కలిగ్గే ఓ విధమైన 'ఇది' అతని కంఠంలో తొంగిచూసింది.

## రూమ్ నెంబర్ థర్టీఎయిట్

నారాయణ చిన్నగా నవ్వాడు. ''ప్రతి లెక్చరరూ ఒకప్పుడు స్టూడెంటే. లెక్చరర్ అయిన తరువాత అతన్ని ఇన్సల్ట్ చేసేటప్పుడు అతనికి తన స్టూడెంట్ డేస్ గుర్తుకు రావు. కాని నిన్న మీ క్లాసులో జరిగిన సంఘటన ఆ సమయంలో నాకు కోపం తెప్పించినా, అదే సమయంలో నన్ను ఆలోచింపజేసింది. ఈ రోజు అటెండర్ వెళుతూండటం, వెనుక మీరు వెళుతూండటం నేను స్టూడెంట్‌లా బిహేవ్ చేయటం ... నేనలా ఎందుకు ప్రవర్తించినానో నాకు తెలీదు'' నారాయణ కంఠంలో ఓ విధమైన అస్పష్టత కనబడింది.

వాతావరణం తేలికగా అన్పించింది నల్గురికీ.

''డియర్ సార్ !'' అన్నాడు రెడ్డి. మీతో మా పరిచయం జీవితంలో మాకు ఓ గుర్తుంచుకో దగ్గది ఇంతవరకూ ఇంకొకళ్ళను మేము అల్లరి పెట్టేవారం కాని మమ్మల్ని ఎవరూ అల్లరి పెట్టిందిలేదు. మీరు ఈ రోజు నన్ను అలా పిలిచినా నా కెందుకో కోపం రావటంలేదు. నా వల్ల ఇంకొకరికేర్పడ్డ అనుభవాలే నాకూ కలగటం కారణమేమో ?''

''డియర్ ఫ్రెండ్ !'' అంటూ నారాయణ ముగ్గురికి షేక్‌హాండ్ ఇస్తూ మృదువుగా నొక్కి వదిలాడు.

*　　*　　*

తర్వాతెప్పుడూ నారాయణకు ''ముప్పై ఎనిమిది'' అంటే ఎంత ప్రీతో నారాయణంటే స్టూడెంట్స్‌క్కూడా అంతే కలిగింది. అతని క్లాసు ఉల్లాసంగా గడిచిపోయేది.

ఓ రోజు అతను క్లాసు డోర్ పైనుండే గ్లాస్ వెంటిలేటర్‌మీద ఓ చిన్ని అందాల బాలుడు పిల్లనగ్రోవితో, బోసినోటితో నవ్వుతూ వున్న పోస్టర్ అతికించివుండటం గమనించాడు.

''తేనెను కావాలనుకొన్నవాడు తేనెపట్టును చెడగొట్టడు !'' తనలో తాను అనుకొన్నాడు.

ఇప్పటికీ ఆ కాలేజీలో ఆ కార్నర్ క్లాసు వుంది. డోర్‌పైన చిరునవ్వుల చిన్నారి పాప ఇప్పుడూ మనం వెళ్తే నవ్వుతూ స్వాగతం పలుకుతుంది. దానికున్న ప్రత్యేకతా, విశిష్టతా యిప్పుడూ వుంది ! ★


వైద్యంనుండి చక్కటి ఫలితాన్ని పొందండి

# తెల్లమచ్చలకు చికిత్స



తెల్లమచ్చలు నయంకాని వేమీ కావు. సకాలంలో సరైన చికిత్స చేస్తే మిగిలిన జబ్బులలాగే ఇది కూడ నయంచేయొచ్చు. మా నిరంతర పరిశోధనల ఫలితంగా తెల్లమచ్చ (బొల్లి)ను నయం చేయటంలో మేము



విజయం సాధించాం. ఈ మందు ఎంత శక్తివంతమైందంటే ఎంత వేగంగా తగ్గిస్తుందంటే—ఉపయోగించిన వెంటనే చర్మం రంగు మారటం ప్రారంభిస్తుంది, కుదుళ్ళను నాశనం చేస్తుంది. మరియు చర్మం యొక్క సహజరంగును త్వరగా పునరుద్ధరిస్తుంది. ఇతర వైద్యులతో మీరు విసిగిపోయి వుంటే మా మందును ఒక్కసారి వాడినంతనే మీకు తృప్తి కలుగుతుంది. మీ జబ్బును గురించిన పూర్తి వివరాలు వ్రాసి మా ఉచిత సలహాను అడగండి.

ఈ వైద్యం కోసం మందును ఎవరైనా చేయవచ్చును.
విశ్వసనీయమైన ఫలితాన్ని చూచి మొదలెట్టండి.

**SRI AYURVEDIC PHARMACY (ASP .)**

**P.O. KATRI SARAI (GAYA)**



# తెల్ల మచ్చలకు చికిత్స



తీవ్రమైన ఒక పరిశోధన తరువాత తెల్ల మచ్చలను బాగు చేసేందుకు గాను మా మందు కనిపెట్టబడింది చికిత్సను సరిగ్గా పూర్తిగా పొందుతే మచ్చల రంగు మారి శరీరానికి మునుపటి రంగు తిరిగి వస్తుంది. జబ్బు మొదళ్ళలో నుండి కూడా పూర్తిగా నయమౌతుంది. మీరు నిరాశ చెందినట్లయితే తప్పకుండా ఈ చికిత్సను పొందండి. మా చికిత్సను పూర్తిగా పొందినట్లయితే ప్రచారణకై ఒక ఫైల్ ఉచితంగా ఇవ్వబడుతుంది. రోగుల వయస్సుతో సహా జబ్బు పూర్తి వివరాలను వ్రాయండి.

# దాంపత్య జీవితాన్ని ఆనందించండి



బాల్యంలో చేసిన పొరపాట్లకు లేక మరి ఏ ఇతర కారణాలకు గాని లోనై సిగ్గుతో మీ బలహీనతను ప్రదర్శించలేక దాంపత్య జీవితంలో ఎటువంటి ఆనందభరితమైన సుఖాన్ని అనుభవించలేక పోతున్నారా...అయితే రహస్యమైన మీ జబ్బు యొక్క పూర్తి వివరాలను వ్రాయండి. దాంపత్య జీవితంలో గల నిజమైన సుఖాన్ని అనుభవించేందుకు సలహాలను పొందండి.

# తెల్ల వెంట్రుకలు మరియు వెంట్రుకలు రాలిపోవుట

జుట్టును డై చెయ్యనవసరం లేదు మా ఆయుర్వేద చికిత్స (ఆయిల్) వల్ల తెల్ల వెంట్రుకలు మామూలు నలుపు రంగులోనికి మారి స్థిరంగా నిలుస్తాయి. జుట్టు రాలిపోకుండా కాపాడి జుట్టు రాలిన ప్రదేశాన కొత్త జుట్టు వస్తుంది. ఇది మెదడును చల్లపరుస్తుంది. ఒక కోర్సులో 3 ఫైల్స్ ధర రూ. 35/- పోస్టేజి మరియు ప్యాకింగ్ అదనం.

**SHYAM AYURVED BHAVAN (AP)**

***P.O. KATRI SARAI (GAYA) PIN : 805 105***